డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలో నివసించే ఎండీ అస్లాం (36) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్. భాస్కర్, ముజీబ్, గోపాల్, శ్యామ్యుల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

మోతీనగర్: డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ఆదివారం పాదయాత్ర చేపట్టారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? లేదా..? అని కాలనీ మహిళలను చిరు వ్యాపారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అలాగే కాలనీలో ఇల్లు లేకుండా మెట్ల కింద ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలికి ఆయన నిత్యావసర సరుకులు ఇచ్చి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రవి, అగ్రవాసు, గోపాల్, రవీందర్, మహేశ్, శివ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పరిశీలన



బాలానగర్: పిట్టల కులస్తుల శ్మశాన వాటికను కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ ఏఈ రాధాకృష్ణతో కలిసి ఆదివారం పరిశీలించారు. శ్మశనవాటికలో పలు పనుల కోసం నిధులు మంజూరు కాగా వెయిటింగ్ హాల్, వాష్‌రూమ్స్ నిర్మాణాలు, తదితర సదుపాయాలు కల్పించాలని ఏఈకి సూచించారు. కార్యక్రమంలో పిట్టల సంఘం రాష్ట నాయకులు గోపి, జైపాల్, జయమ్మ, బబ్లు, అభిలాష్, అంజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేయించుకున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: పార్థీవ్ లాంగ్ కేర్ సెంటర్, గాయత్రీనగర్ సంక్షేమ సంఘం సంయుక్తాధ్వర్యంలో గాయత్రీనగర్ రాక్ గార్డెన్‌పార్కులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నాగరాజు, రాధా మౌనిక పలు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, గాయత్రీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల కృష్ణారావు, మాజీ అధ్యక్షుడు పెసర సంజీవరెడ్డి, పార్థీవ్ లాంగ్ కేర్‌సెంటర్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బెల్ట్‌ల ప్రదానం



బెల్ట్‌ల ప్రదానోత్సవంలో కార్పొరేటర్ సత్యనారాయణ, చిన్నారులు

కూకట్‌పల్లి: పాపారాయుడు నగర్‌లోని నైస్ స్ప్రింగ్ క్లబ్ హౌస్‌లో మాస్టర్ సంజయ్ ఏర్పాటు చేసిన తైక్వాండోలో చిన్నారులకు ఆదివారం బెల్ట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ.. స్వీయ రక్షణకు కరాటే, తైక్వాండో వంటివి నేర్చుకోవాలని అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాపారాయుడు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణలు..!



- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా వ్యాపారాలు
- మోతీనగర్‌లో తీవ్రంగా ట్రాఫిక్ జామ్
- స్థానికులు, వాహనదారుల అవస్థలు

మోతీనగర్: మోతీనగర్ కమిటీ హాల్ పక్క వీధిలో ట్రాఫిక్ జామ్‌తో అటు స్థానికులు, ఇటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, టీ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు కమిటీ హాల్ పక్కన ఎన్టీఆర్ విగ్రహం ఎదుట యూటర్న్ ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హైటెక్ సిటీకి మార్గమధ్యన ఈ దారి కావడంతో ఎక్కువ శాతం మంది మోతీనగర్‌లో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపిస్తారు. సమీపంలోనే పాఠశాలలు, ఆసుపత్రులు ఉండడంతో ఈ రోడ్డు ఎప్పుడూ జన సంచారంతో రద్దీగా ఉంటోంది. పాదాచారుల కోసం ప్రభుత్వం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తే అవి చిరు వ్యాపారులు, అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారాయి. వాటిని నియంత్రించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం.. అంబులెన్స్ వెళ్లాలన్నా గంటల తరబడి చూడాల్సిందే. ట్రాఫిక్ పోలీసులు మాత్రం వీఐపీలు పర్యటనకు వచ్చినప్పుడు మాత్రమే ప్రధాన కూడళ్లలో దర్శనమిస్తారు. మిగిలిన సమయాల్లో కనబడరు. వీటిన్నిటికీ కారణం రోడ్డు రెండు కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బాలానగర్, ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసుల పరిధిలో వస్తుంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న రోడ్లలో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



మోతీనగర్ కమ్యూనిటీ హాల్ వీధిలో వాహనాల రద్దీ

నాట్స్ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు సన్మానం





శ్రీహరిని సన్మానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నార్త్ అమెరికా తెలుగు సొసైటీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మందడి శ్రీహరిని ఆదివారం ఘనంగా సన్మానించారు. శ్రీహరి ఇండియాలో ఉన్నత విద్యనభ్యసించి అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. అక్కడ తెలుగువారి అభ్యున్నతికి తెలుగు సంఘాలు ఎన్ఆర్ఐటీడీపీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించి విశిష్టమైన సేవలు అందించారు. స్వదేశీ పర్యటనలో భాగంగా ఆదివారం హైదరాబాద్ రాగా కేపీహెచ్‌బీ కాలనీలో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు గణేశుని అజయ్‌కుమార్, మందడి వరప్రసాద్ రావు, గురు ప్రసాద్, కట్టమూరు గ్రామానికి చెందిన వాస్తవ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాసానికి వచ్చిన మందడి శ్రీహరిని కార్పొరేటర్లు నార్నే శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య, తెలంగాణ సభ్యులతో కలిసి ఆదివారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ సభ్యులు అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, చాపరాల శ్రీనివాస్ దాసు, నాగభూషణం, తాళ్లూరు చంద్రమౌళి, పాండురంగారావు, ప్రసాద్, కిలారు మనోహర్, కోనేరు ప్రసాద్, సైదేశ్వర్‌రావు, రాధాకృష్ణ, తిలక్, అనిల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

దుండిగల్: దుండిగల్ డబుల్ బెడ్రూం సముదాయంలో మాజీ సర్పంచ్ కావలి గణేశ్, ఆకుల ప్రేమ్ పటేల్ ఆధ్వర్యంలో మెడ్‌విజన్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు సాగిన క్యాంప్‌లో పలు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కాంగ్రెస్ యువ నాయకుడు బొంగునూరు కిశోర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశంముదిరాజ్, దుండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నాయకులు పండుగ శ్రీశైలం ముదిరాజ్, జక్కుల గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



ఉత్సవాల్లో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: వివేక్‌నగర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద మహాబలి శక్తి కేంద్రం అమ్మ పేరు మీద మొక్క నాటే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డా.ఎన్. వంశీరెడ్డి సమక్షంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు డీ నర్సింగ్‌రావు, ఏ. గోపాలరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కన్వీనర్ భాస్కర్ గౌడ్, కో కన్వీనర్ మల్లికార్జున్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రాజు, కే. వేణు, బీజేపీ సీనియర్ నాయకురాళ్లు లలితా రెడ్డి, మమత, డీ మాధవి, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సెక్రటరీ శ్రీనివాస్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కాలనీ ఎన్నికలు



ఎమ్మెల్యే గాంధీతో కమల ప్రసన్ననగర్ కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: కమల ప్రసన్ననగర్ కాలనీ కమిటీ వారు కాలనీ ఎన్నికల్లో పెట్టకుండా జాప్యం చేస్తూ, అదేవిధంగా సొసైటీ కార్యాలయానికి తాళం వేసి అందుబాటులో లేకుండా చేశారు. ఈ విషయమై కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన కార్యాలయం అందుబాటులో ఉండేలా చూస్తానని అలాగే ఎన్నికలు కూడా అతి త్వరలో జరిగేలా చూస్తానని ఆయన హామీనిచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ ప్రతినిధులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. గాజులరామారం డివిజన్ సాయిగ్రామం కాలనీలో భూగర్భ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని అధ్యక్షుడు అరుణ్‌కుమార్, యండమూరి ఎం గ్రీన్ ఆష్పన్స్ కాలనీలో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధ్యక్షుడు చంద్రశేఖర్ విన్నవించారు. వీటిపై స్పందించిన వివేకానంద్ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రాలు ఇస్తున్న ప్రజలు

ఎమ్మెల్యే పూజలు

చింతల్ డివిజన్ శ్రీసాయినగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీసాయినగర్ కాలనీ వాసులు కర్నెకంటి లక్ష్మణ్, కర్నెకంటి మల్లేశ్, కల్యాణ్ రావు పాటిల్, చిరంజీవి, బాలాజీ, సుబ్రమణ్యం, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రాలు ఇస్తున్న అసోసియేషన్ల సభ్యులు

కుత్బుల్లాపూర్: సమస్యలు పరిష్కరించాలని ఎండమూరి ఎన్‌క్లేవ్, గ్రీనరీ వెల్ఫేర్ అసోసియేషన్, దేవభూమినగర్, పీపీనగర్, చిత్తరమ్మాదేవినగర్, నిజాంపేట్‌లోని పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఉన్నాయని విన్నవించగా స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధుల ద్వారా వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

ఘనంగా శివశివానీ డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

కుత్బుల్లాపూర్: కొంపల్లి శివశివానీ డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హాజరై ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను నిర్దేశించేది యువతే అని, డబ్బు కోసం కాకుండా జ్ఞానం కోసం కృషి చేయాలన్నారు. సరైన మార్గంలో నడిచి దేశ ఉన్నతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శివశివానీ విద్యా సంస్థల అధ్యక్షురాలు ఆర్తి సంపతి, వైస్ ప్రెసిడెంట్ శైలేష్ సంపతి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆర్థిక సాయం అందించేందుకు కృషి

కూకట్‌పల్లి: బాలాజీనగర్ మోర్ సూపర్‌మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రసాద్ బైక్ మెకానిక్ షెడ్ శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అందులో బైక్‌లు, ఇంజిను, బ్యాటరీలు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు షెడ్‌ను ఆదివారం పరిశీలించి తహసీల్దార్, ఇతర అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్ చౌదరి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సుభాష్ గౌడ్, అంజిరెడ్డి, సత్యనారాయణ, యువ నాయకులు శ్రీకాంత్, కృష్ణ, వెంకట్, శాంతి తదితరులు పాల్గొన్నారు.



షెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న ఇంటి యజమానులు

మోతీనగర్: 30 ఏళ్ల క్రితం భాగ్యనగర్ కో–ఆపరేటివ్ సొసైటీ పేరిట ప్లాట్లు కొనుగోలు చేసినప్పటికీ అనుమతులు ఇవ్వకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని భాగ్యనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఇంటి యజమానుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 1007లో 165 ఎకరాలను కొనుగోలు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారవేత్తలతో కలిపి సుమారు 1400 మంది సభ్యులు ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. కోర్టు పర్యవేక్షణలో పలు సేల్ డీడ్‌ల ద్వారా రిజిస్ట్రేషన్లు చట్టబద్ధంగా పూర్తయినా ప్లాట్లు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా అనుమతులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఇంటి యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు సతీమణి విజయలక్ష్మి శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ నంద్యాల నియోజవకర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రారెడ్డి, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, సయ్యద్ బాబు, మాజీ కౌన్సిలర్ సీఎస్. సత్యనారాయణ, సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు గార్లపాటి మోహన్‌రెడ్డి, ఆర్‌జీ రుద్ర గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామితో పాటు వివిధ పార్టీల నాయకులు సంక్షేమ సంఘం ప్రతినిధులు వివిధ కాలనీ బస్తీల అధ్యక్షులు మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



నివాళులర్పించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీ విజయభాస్కర్‌రెడ్డి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఆయన నివాసానికి వెళ్లి శ్రీనివాస్ రెడ్డి పార్థీవ దేహం వద్ద నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో రామ్మోహన్, సతీశ్ గౌడ్, నగేశ్, కే. మహేందర్, జీ సాయిలు యాదవ్, సీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గొలుసు దొంగల అరెస్ట్

కేపీహెచ్‌బీ: కేపీహెచ్‌బీ కాలనీలో ఇటీవల వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును తెంచుకొని పారిపోయిన ఇద్దరు దొంగలను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 31న ఉదయం కేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయ గ్రౌండ్స్ సమీపంలో పాల ప్యాకెట్ కోసం ఇంటినుంచి బయటకు వచ్చిన వృద్ధురాలు శ్యామల మెడలోని బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా సిసి కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా షాపూర్ గేట్ ప్రాంతానికి చెందిన నస్రత్ అలీ మహ్మద్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లా, యహియాపూర్ ప్రాంతానికి చెందిన ఇర్షాద్ అహ్మద్ (32)లుగా గుర్తించారు. వీరు కేపీహెచ్ బీ ప్రాంతంలో దొంగిలించిన బంగారు గొలుసును విక్రయించే క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. వీరిద్దరూ డ్రైవర్లుగా పని చేస్తూ స్నేహితులుగా మారారని, మహారాష్ట్ర లోని ముంబై తదితర ప్రాంతాల్లో పలు నేరాల్లో నిందితులుగా జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. అయితే వీరిని ఇరానీ గ్యాంగ్‌కు చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు.



బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి

కుత్బుల్లాపూర్: రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లారెడ్డి సూచించారు. కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీశ్‌సాగర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయి కమిటీలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మల్లారెడ్డితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణేశ్వర్, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు సత్తా చాటేందుకు ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీలను నెరవేర్చని విషయాన్ని ప్రజల్లోకి గట్టిగా తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలో చేపట్టబోయే భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరితరావు, అసెంబ్లీ కో.కన్వీనర్ శివాజీరాజు, గిరిజన మోర్చా జిల్లా నాయకుడు శంకర్‌నాయక్, సీనియర్ నాయకులు చక్రధర్, నర్సింగ్‌రావు, కొంపల్లి మున్సిపల్ నాయకులు, బూత్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీశ్‌సాగర్

మ్యాన్‌హోళ్లకు మరమ్మతు!



సంజయ్‌గాంధీనగర్ రోడ్డులో మరమ్మతు చేసిన మ్యాన్‌హోల్



గాంధీనగర్ పారిశ్రామికవాడ నుంచి సంజయ్‌గాంధీనగర్ వద్ద ..

రంగారెడ్డినగర్: భూమిలోకి కుంగి రాకపోకలకు ఆటకంగా మారిన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లపై ఎట్టకేలకు జలమండలి అధికారులు స్పందించారు. సంజయ్ గాంధీనగర్‌లోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డులో నెల క్రితం భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగింది. అదేవిధంగా గాంధీనగర్ పారిశ్రామిక వాడ నుంచి సంజయ్‌గాంధీనగర్‌కు వెళ్లే మూల మలుపు వద్ద మరో మ్యాన్‌హోల్ కుంగి ప్రమాదకరంగా మారింది. వీటికి మరమ్మతులు నిర్వహించడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన అధికారులు వాటికి మరమ్మతులు నిర్వహించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.